సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శనివారం 28-9-2024
సంపుటి: 20 సంచిక: 159
పేజీలు: 4 వెల: రూ.1

## విలీన పంచాయితీలకు తాగునీటి సౌకర్యం

### - ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

నగరంలో విలీనమైన గ్రామపంచాయతీలు చాపురం, సిద్దిపేట, గోవిందపురం గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించడానికి ఎమ్మెల్యే గొండు శంకర్ తీసకున్న చొరవపై స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. వైకాపా పాలనలో ఐదేళ్ల నిర్లక్ష్యంకు గురై తాగునీరు లేక ఎన్నో ఇబ్బందులు గురైన గ్రామాలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు టిడ్కోకి వెళ్లే పైపు నుంచి చాపురంలో ఉన్న వాటర్‌ట్యాంకుకు కనెక్టివిటీ పనులు శంకుస్థాపన చేయడంపై పంచాయితీ ఇన్‌చార్జ్ అల్లు నరసయ్య, గ్రామపెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు గొండు శంకర్ దృష్టికి గ్రామంలో తాగునీటి సమస్యపై వివరించామని, అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని 100రోజుల్లో సార్థకం చేశారన్నారు. ఎమ్మెల్యే చొరవతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పంచిరెడ్డి అప్పలనాయుడు, మట్ట ఆనంద్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.












# అధికారం పోతే.. ఇట్టుంటదా?



- దండం పెట్టే కార్యక్రమానికి ధర్మాన దూరం
- మరొకరికి బాధ్యతలు అప్పగించని వైనం
- అన్నతోనే నెట్టుకొచ్చేస్తున్న పరిస్థితి
- ధర్మాన మౌనంతో పార్టీకి తీరని నష్టం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎన్నికల ముందు వరకు అధికార హోదాను అనుభవించి, మరో 30ఏళ్లు తామే అధికారంలో ఉంటామని ఎగిరెగిరి పడిన జగనన్న సోదరులు ఇప్పుడు అధికారం పోయేసరికి ఉద్యమాల మాట దేవుడెరుగు, కనీసం దేవుడికి దండం పెట్టుకునే కార్యక్రమానికి కూడా హాజరవడానికి ఇష్టపడలేదు. ఇక రాష్ట్ర మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు సంగతి సరేసరి. తిరుపతి లడ్డూలో యానిమల్ ఫ్యాట్ కలపడం ద్వారా అపవిత్రమైందంటూ జనసేన ప్రాయశ్చిత్త దీక్ష చేపడుతుంటే, చంద్రబాబు క్షుద్ర రాజకీయాలు మానుకొని బుద్ధిని ప్రసాదించాలని వైకాపా శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలకు పిలుపునిచ్చింది. జగన్మోహన్ రెడ్డి యానిమల్ ఫ్యాట్ కలిపి అపచారానికి పాల్పడివుండరనే ఎక్కువమంది నమ్ముతున్నారన్న భావనలోనే ఉన్నారు. కానీ అది వాస్తవమని నిరూపించే కార్యాచరణకు మాత్రం వైకాపా శ్రేణులు ముందుకు రాలేదు. ఉదయం 10.30గంటలకు స్థానిక నారాయణతిరుమలలో పూజలు నిర్వహించడానికి పిలుపునిస్తే 11 దాటినా పట్టుమని 10మంది అక్కడ కనిపించలేదు. దీనికి తోడు ధర్మాన ప్రసాదరావు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని తెలియడంతో వెళ్తే ఏమవుతుందో, వెళ్లకపోతే ఏమవుతుందో అన్న సందిగ్ధంలో కేడర్ నారాయణతిరుమలకు రానట్టు తెలుస్తుంది. ఎన్నికల ఫలితాల తర్వాత ధర్మాన ప్రసాదరావు పూర్తిగా తన బంగ్లాకే పరిమితమైపోయారు. తెలుగుదేశం 100రోజుల పాలనలో వైఫల్యాలను ఎండగట్టే కార్యాచరణను వైకాపా ఎలాగూ చేపట్టలేదు. ఇక కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగినది వైఎస్ జయంతి, వర్ధంతి మాత్రమే. ఈ రెండు కార్యక్రమాలకూ ధర్మాన ప్రసాదరావు హాజరుకాలేదు. వీటిని కూడా తప్పనిసరి తద్దినంలా నిర్వహించారు. ఇప్పుడు తాజాగా ఆలయాల్లో పూజలు కార్యక్రమానికి కూడా ధర్మాన ప్రసాదరావు దూరంగా జరిగారు. దీంతో శ్రీకాకుళం నియోజకవర్గంలో కేడర్ కనిపించలేదు. జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ నరసన్నపేటలో ఈ కార్యక్రమాన్ని చేపట్టి శ్రీకాకుళంలో నిర్వహించడానికి వచ్చారు. ఎందుకంటే.. తన తమ్ముడికి ఆరోగ్యం బాగులేదని చెబుతున్నారు. ఇదే విషయాన్ని కొద్ది రోజుల క్రితం జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో కూడా కృష్ణదాస్ చెప్పుకొచ్చారు. కాబట్టి ఇప్పుడు శ్రీకాకుళం బాధ్యతలు కూడా ఆయనే నెత్తిన వేసుకోవాల్సి వచ్చింది. ధర్మాన ప్రసాదరావుకు ఆరోగ్యం సరిగా లేనప్పుడు శనివారం నాటి కార్యక్రమాన్ని నగరంలో ఒకరికి, రూరల్, గార మండలాల్లో మరో ఇద్దరికి అప్పగించి విజయవంతం చేయాలని - మిగతా 4లో

# ఇంకో ఉత్తరం!






- భారత శాస్త్రవేత్తలు సంధించిన మరో లేఖాస్త్రం
- పెద్దఎత్తున 176 మంది శాస్త్రవేత్తల సంతకాలతో లేఖ
- ఇద్దరు శాస్త్రవేత్తలకు అవార్డు ఇవ్వకపోవడం పట్ల కినుక

- గత ప్రభుత్వ ఆనవాయితీలను మార్చడం ద్వారా వాటి ఆనవాళ్లను చెరిపేయాలని నరేంద్రమోదీ ప్రభుత్వం అన్ని రంగాలలో కృషి చేస్తోంది. మరో వందేళ్లయినా చెక్కుచెదరని పార్లమెంటును వదిలేసి కొత్త పార్లమెంటు కట్టినట్టుగానే, ఢిల్లీలోని అనేక వీధుల పేర్లు మార్చినట్టుగానే, చాలా ప్రభుత్వ పథకాల్లో నెహ్రూ, ఇందిరల పేర్లు తొలగించి జనసంఘ్ నేతల పేర్లు చేర్చినట్టుగానే భట్నాగర్ అవార్డును ఎత్తేయాలని చూసింది. కాని, శాస్త్రవేత్తలు ఈ ప్రయత్నాన్ని భారత శాస్త్రవేత్తల బృందం ఖరాఖండీగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గింది.
- ఆరు దశాబ్దాల తర్వాత ఈ ఎంపిక కమిటీలో శాస్త్రవేత్తలను భారీగా కుదించి, వారి స్థానంలో ప్రభుత్వ అధికారులను చేర్చింది. విజేతల వివరాలు వెల్లడించే అధికారం శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రివర్యుల చేతిలో ఉండేట్లు నిబంధనలు సవరించింది.
- పత్రికలలో వస్తోన్న పలురకాల కథనాలపై స్పష్టమైన వివరాలు కోరుతూ వారు రాసిన లేఖ సంచలనం సృష్టించింది. అవార్డులలో పైరవీలు జరిగినట్టు, శాస్త్రవేత్తలు కానివారికి పురస్కారాల జాబితాలో చేర్చినట్టు, తాము సూచించిన పేర్లను ప్రభుత్వం తొలగించి నట్టు, తదితర వదంతులు రేగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈమారు ప్రకటించిన పురస్కారాల నేపథ్యం తెలియజెప్తే అందరి సంశయాలు తీరుతాయని, శాస్త్రవేత్తల మీద మాయని మచ్చలు చెరిగిపోతాయని వారు భావించారు. వారి డిమాండుకు తగినట్టు గానే పిఎస్‌ఏ అజయ్ సూద్ శాస్త్రవేత్తలకు ఒక జవాబు రాశారు.
- వెంటనే ప్రభుత్వం అవార్డులకు సంబంధించి ఏర్పరచిన నూతన నిబంధనలను ఉపసంహరించుకుని, జాబితా నుంచి తొలగించిన ఇద్దరు శాస్త్రవేత్తలకు వెంటనే అవార్డులను ప్రకటించాలని వారు కోరారు. దీనికి ఇంకా పిఎస్‌ఏ నుంచి సమాధానం రాలేదు.

మన దేశపు అత్యున్నత సైన్స్ పురస్కారం శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డులపై పరుచుకున్న నీలినీడలు ఇంకా వీడలేదు. సరికదా మరింత ముసురుకుంటున్నట్టే కనిపిస్తోంది. ఈ ఏడాది బహూకరించిన అవార్డులలో అర్హులైన ఇద్దరు శాస్త్రవేత్తలను ఉద్దేశ పూర్వకంగానే భారత ప్రభుత్వం జాబితా నుంచి తప్పించడంపై నిరసన తెలుపుతూ 26 మంది శాస్త్రవేత్తలు ఆగష్టు 30న కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగ ముఖ్య కార్యదర్శి (పిఎస్‌ఏ)కు లేఖ రాసారు. పత్రికలలో వస్తోన్న పలురకాల కథనాలపై స్పష్టమైన వివరాలు కోరుతూ వారు రాసిన లేఖ సంచలనం సృష్టించింది. అవార్డులలో పైరవీలు జరిగినట్టు, శాస్త్రవేత్తలు కానివారికి పురస్కారాల జాబితాలో చేర్చినట్టు, తాము సూచించిన పేర్లను ప్రభుత్వం తొలగించినట్టు, తదితర వదంతులు రేగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈమారు ప్రకటించిన పురస్కారాల నేపథ్యం తెలియజెప్తే అందరి సంశయాలు తీరుతాయని, శాస్త్రవేత్తల మీద మాయని మచ్చలు చెరిగిపోతాయని వారు భావించారు. వారి డిమాండుకు తగినట్టుగానే పిఎస్‌ఏ అజయ్ సూద్ శాస్త్రవేత్తలకు ఒక జవాబు రాశారు.

### అవార్డుల రగడ

మన దేశంలో 1958 నుంచీ ప్రదానం చేస్తున్న ఈ అవార్డును ప్రముఖ శాస్త్రవేత్త శాంతిస్వరూప్ భట్నాగర్ పేరుమీద నెలకొల్పారు. వివిధ శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, భూ వాతావరణ పరిశోధన, ప్లానెటరీ సైన్స్ తదితర విభాగాలలో మన దేశీయ శాస్త్రవేత్తలు చేసిన గణనీయమైన కృషికి అందించే ఈ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వ సైన్స్, టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉన్న సిఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్)కు అప్పజెప్పారు. గత ప్రభుత్వ ఆనవాయితీలను మార్చడం ద్వారా వాటి ఆనవాళ్లను చెరిపేయాలని నరేంద్రమోదీ ప్రభుత్వం అన్ని రంగాలలో కృషి చేస్తోంది. మరో వందేళ్లయినా చెక్కుచెదరని పార్లమెంటును వదిలేసి కొత్త పార్లమెంటు కట్టినట్టుగానే, ఢిల్లీలోని అనేక వీధుల పేర్లు మార్చినట్టుగానే, చాలా ప్రభుత్వ పథకాల్లో నెహ్రూ, ఇందిరల పేర్లు తొలగించి జనసంఘ్ నేతల పేర్లు చేర్చినట్టుగానే భట్నాగర్ అవార్డును ఎత్తేయాలని చూసింది. కాని, శాస్త్రవేత్తలు ఈ ప్రయత్నాన్ని భారత శాస్త్రవేత్తల బృందం ఖరాఖండీగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గింది. స్వతంత్రంగా ఉన్న ఈ అవార్డును ఒక సమూహంలో చేర్చింది. మొత్తం శాస్త్ర సాంకేతిక పురస్కారాలను రాష్ట్రీయ విజ్ఞాన పురస్కారాలనే పెద్ద సమూహంగా ఏర్పాటు చేసింది. దానిని విజ్ఞాన రత్న, విజ్ఞాన శ్రీ, విజ్ఞాన్ యువ శాంతిస్వరూప్ భట్నాగర్, విజ్ఞాన బృందం అని నాలుగు విభాగాలుగా విడదీసింది. ఆందోళనకరంగా, ఈ అవార్డుల ఎంపిక విధానాన్ని మార్చింది. గత ఏడాది వరకు ప్రతి విభాగపు సెలక్షన్ కమిటీలోను గతంలో ఈ భట్నాగర్ అవార్డు పొందిన శాస్త్రవేత్తలు ఉండేవారు. ఆరు దశాబ్దాల తర్వాత ఈ ఎంపిక కమిటీలో శాస్త్రవేత్తలను భారీగా కుదించి, వారి స్థానంలో ప్రభుత్వ అధికారులను చేర్చింది. విజేతల వివరాలు వెల్లడించే అధికారం శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రివర్యుల చేతిలో ఉండేట్లు నిబంధనలు సవరించింది.

> " అవార్డుల ఎంపికలో రాజకీయాలు జోక్యం చేసుకోవడం వల్ల దాని ప్రభావం నేరుగా వారు చేసే ప్రయోగాలపైన పడుతుందని, వాటి నాణ్యతలో రాజీపడే ప్రమాదముందని ఈ లేఖలో దుయ్యబట్టారు. ఇదివరకు ఎన్నడూ ఈ విధమైన ప్రయోగం శాస్త్రవేత్తల విషయంలో జరగలేదని, వారి పనిలో రాజకీయ జోక్యం తీవ్ర నష్టానికి దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. "

### వరుస ఉత్తరాలతో హడావిడి

ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలకు అజయ్‌సూద్ రాసిన లేఖలో కొత్తగా ఏమీ లేదు. మార్చిన నిబంధనలు ఆయన వల్లెవేసారు తప్ప ప్రభుత్వం ఇద్దరు శాస్త్రవేత్తల పేర్లను జాబితా నుంచి ఎందుకు తొలగించారో ఆ లేఖలో వివరించలేదు. దాంతో మండిపడిన శాస్త్రవేత్తలు 176 మంది మరో లేఖాస్త్రాన్ని సంధించారు. అయితే ఈ బృందంలో శాస్త్రవేత్తలతో పాటు సీనియర్ అకడమీషియన్లు, ఐఐఎస్ఇఆర్ వంటి సంస్థల అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు తమ నిరసన స్వరాన్ని మేళవించారు. ఈ అవార్డుల ఎంపికలో శాస్త్రవేత్తల పాత్రను, ప్రమేయాన్ని కుదించి, వారి స్థానంలో రాజకీయ నేతల జోక్యాన్ని పెంచడంపై తీవ్రంగా మండిపడ్డారు. వివిధ జాతీయ విజ్ఞాన సంస్థలలో అహరహం కృషి చేస్తున్న భారతీయ శాస్త్రవేత్తలను గుర్తించి ఇచ్చే ప్రోత్సాహకాల్లాంటి ఈ అవార్డుల ఎంపికలో రాజకీయాలు జోక్యం చేసుకోవడం వల్ల దాని ప్రభావం నేరుగా వారు చేసే ప్రయోగాలపైన పడుతుందని, వాటి నాణ్యతలో రాజీపడే ప్రమాదముందని ఈ లేఖలో దుయ్యబట్టారు. ఇదివరకు ఎన్నడూ ఈ విధమైన ప్రయోగం శాస్త్రవేత్తల విషయంలో జరగలేదని, వారి పనిలో రాజకీయ జోక్యం తీవ్ర నష్టానికి దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

### ఉక్కిరిబిక్కిరి

ప్రస్తుతానికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ గొంతు వినిపించే శాస్త్రవేత్తలను అవార్డుల జాబితా నుంచి తొలగించినట్టే కనిపిస్తుందని, భవిష్యత్తులో ఇది అనేక దారుణమైన రూపాలు తీసుకుంటుందని ఆందోళన చెందుతున్నారు. క్రమంగా ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడేవారి పేర్లనే అవార్డులకు పరిశీలించే పరిస్థితి ఏర్పడుతుందని భయపడుతున్నారు. దీని వెనుక ఊహించని కోణాలున్నాయని వారు చెప్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారికి అవార్డులు నిరాకరించడంతో ఆగకుండా గ్రాంటులు, నిధుల సరఫరా ఆపేస్తే ఆ పరిస్థితిని ఊహించలేమన్నారు. ఉద్యోగాల భర్తీలో, సంస్థ నుంచి సంస్థకు జరిపే బదిలీలలో, పదోన్నతులలో తీవ్రమైన ప్రభావం చూపే వీలుందన్నారు. ఇది సైన్స్ ఆచరణకు అగాధం సృష్టిస్తుందన్నారు. దీనివల్ల భారతదేశంలో శాస్త్ర ప్రగతి కుంటుపడే అవకాశముందని వాపోతున్నారు. వెంటనే ప్రభుత్వం అవార్డులకు సంబంధించి ఏర్పరచిన నూతన నిబంధనలను ఉపసంహరించుకుని, జాబితా నుంచి తొలగించిన ఇద్దరు శాస్త్రవేత్తలకు వెంటనే అవార్డులను ప్రకటించాలని వారు కోరారు. దీనికి ఇంకా పిఎస్‌ఏ నుంచి సమాధానం రాలేదు.

- దుప్పల రవికుమార్

• ఎడిటోరియల్

## రంగుల ప్రపంచం!

సినిమా చూస్తున్నంతసేపూ ఓ రంగుల ప్రపంచం కనపడుతుంది. అన్యాయాలపై, అక్రమాలపై, దౌర్జన్యాలపై తిరగబడటం, నాయకుడు విజయం సాధించడం చూస్తుంటే ఆనందం కలుగుతుంది. అందులో కథ, బాధితుల వైపు నిలబడుతుంది. హీరో బాధితులకు న్యాయం జరిగేట్టు పోరాడుతాడు. చాలా వరకు సినిమా న్యాయం వైపే ఉంటుంది. కానీ అది సినిమానే. సినిమా అల్లిక కథ, అందులోదంతా నటన. నిజజీవితంలో వేరుగా ఉంటుంది. సినిమా హీరోలంతా బయట మాత్రం అంత నిజాయితీగా ఏమీ ఉండరు. ఈ విషయాలను ఎప్పుడో మన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ తన 'పాకుడురాళ్లు' నవలలో చాలా వివరంగా రాశారు. ఇప్పుడు ప్రత్యక్షంగానే చూస్తున్నాము. అన్నదాతలను ఉన్నతంగా చూపించే సినిమాలు అందులోని హీరో హీరోయిన్లు బయట, వారిని హేళన చేస్తారు. స్త్రీల పట్ల గౌరవంగా నటించే నటులు అత్యంత అభ్యంతరంగా స్త్రీల గురించి మాట్లాడతారు. కులము, మతము, ప్రాంతము, రాజకీయము, అసూయ, ద్వేషాలు అన్నీ ఈ రంగుల తెరలకింద మనం చూస్తాము.అందుకు ఓ ఉదాహరణ, జానీ మాస్టరుగా చెప్పబడుతున్న కొరియో గ్రాఫర్ వ్యవహారం. నృత్యం అంటే మనకెంతో ఆనందం వేస్తుంది. అదొక గొప్పకళ. అది ఒకప్పుడు. ఇప్పుడు బజారులో అమ్మబడుతోన్న నైపుణ్యం మాత్రమే. సినిమా అంటే యువతలో ఎప్పటికీ ఎంతో క్రేజ్ ఉంటుంది. సినిమాలో పని చేయటం అనేది ఒక జీవిత లక్ష్యంగా పని చేస్తున్నవాళ్లూ, వెంపర్లాడుతున్న వాళ్లూ అనేకం. అందులో ముఖ్యంగా ఆడపిల్లలు ఈ సినీ జగత్తులోకి రావటానికి ప్రయత్నం చేస్తే ఎదురయ్యే సమస్యలు ఎన్నో ఉంటాయి. అనేక అనుభవాలూ మనముందున్నాయి. కొన్నయితే భయంకరమైనవిగా కనపడతాయి. ఆడపిల్లలపై వివక్ష ఏరంగంలోనైనా సాగుతున్నదే. జానీ మాస్టారు, తనతో పనిచేస్తున్న ఒక మహిళా కొరియోగ్రాఫర్‌పై లైంగికంగా దాడి చేశాడని, ఓ నలభై పేజీల ఫిర్యాదు, ఆ మహిళే పోలీసు స్టేషన్‌లో ఇచ్చింది. క్విడ్ ప్రోకో ఒప్పందాలు ఇప్పటివేం కాదు. క్యాస్టింగ్ కౌచ్‌పై మీటూ ఉద్యమాలు చాలా రోజులుగా జరుగుతున్నాయి. ఆ మహిళా కొరియోగ్రాఫర్ ఫిర్యాదు ఆధారంగా జానీ మాస్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె మైనర్‌గా ఉన్నప్పుడే లైంగిక దాడి జరిగినందున ఫోక్సో కేసు పెట్టారు. కోర్టు రిమాండుకు పంపింది. అవకాశాలు ఇవ్వాలంటే, తాము చెప్పినట్లు వినాలని అనేక మంది సినీ పురుష పుంగవులు వేధించడం దారుణం. లైంగిక వేధింపులకు దిగడం సహించరానిది. చట్టప్రకారం విచారణ చేసి చర్యలు తీసుకోవాలనే అందరూ కోరుతున్నారు. ఎప్పుడో 2020లో జరిగిన సంఘటనను ఇప్పుడు ఆ మహిళ చెప్పడానికి కారణమేమిటనీ విమర్శకులు ప్రశ్నిస్తున్నారు. తనను మతం మార్చుకోమని, పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసినట్టూ ఆమె చెపుతున్నది. కచ్చితంగా విచారణ చేయాలి. దోషిని శిక్షించాలి. కానీ సందులో సడేమియాలా అది లవ్‌జీహాద్ అని, మతపరమైన అంశంగా మార్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇదే సందర్భంలో పూనమ్‌కౌర్ అనే ఉత్తరాది హీరోయిన్, త్రివిక్రమ్ శ్రీనివాస్ నాపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని నేనెప్పుడో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశానని, కానీ ఏ చర్యలూ తీసుకోలేదని ఆరోపించారు. డబ్బు, రాజకీయ ప్రాబల్యాలు కూడా ఇలాంటి వాటిలో ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. కేరళలో తమ సినిమా ఫీల్డులో మహిళల రక్షణ, దాడులకు సంబంధించిన వివరాలు సేకరించడానికి హేమకమిటీని వేసి, అన్నింటినీ బయటపెట్టింది. చర్యలకూ ఉపక్రమించింది. అలాంటి ప్రయత్నం మన తెలుగు, తమిళ, హిందీ సినిమా రంగంలోనూ జరగాలి. అప్పుడే వేధింపులకు గురవుతున్న మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి చెప్పగలుగుతారు. అయితే టాలీవుడ్‌లో ఇలాంటివి జరగకుండా చూసుకోవడానికి, మహిళల రక్షణకు సరైన గైడ్‌లైన్స్ ఏవీ లేవని, ఇది అన్‌ఆర్గనైజ్డ్ సెక్టార్‌గా ఉందని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు. జానీ మాస్టర్ కేసుకు సంబంధించి, ఎన్ని భిన్న వాదనలు వినిపిస్తున్నా గానీ తెలుగు సినిమా రంగంలో కొనసాగుతున్న ఈ మురికి, అనైతిక, నేరపూరిత విషయాలపై సమగ్ర దర్యాప్తు జరపవలసే ఉన్నది. కనపడ్డంత రంగుల ప్రపంచం కాదని, వివక్షతలు, దాడులు అన్నీ ఇందులో ఉన్నాయనేది గుర్తించి అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం తగిన చర్యలూ తీసుకోవాలి.





బంగ్లాదేశ్ క్రికెట్ జట్టులో మీకెవరు తెలుసు అని అడిగితే.. క్రికెట్ అంటే అంతంత మాత్రం తెలిసిన వాళ్లు కూడా చెప్పే పేరు షకీబుల్ హసన్. ఇండియాలో షకీబుల్ హసన్, ముస్తఫిజుర్ రెహ్మాన్ తప్ప.. ఇతర ఆటగాళ్ల పేర్లు చాలా మందికి తెలియదు. షకీబుల్ హసన్ బంగ్లా క్రికెట్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్లిన ఆటగాడు. 2006లో క్రికెట్ కెరీర్ స్టార్ట్ సిన షకీబ్ అల్ హసన్.. 66 టెస్టులు, 247 వన్డేలు, 125 ఇంటర్నేషనల్ టీ20లు, 102 ఫస్ట్ క్లాస్ క్రికెట్ మ్యాచ్‌లు ఆడాడు. షకీబ్ అంతర్జాతీయ క్రికెట్‌లో 14 సెంచరీలు చేశాడు. మరోవైపు బౌలింగ్‌లో కూడారాణించాడు. టెస్టుల్లో 233 వికెట్లు, వన్డేల్లో 315 వికెట్లు, టీ20ల్లో 84 వికెట్లు తీసి బెస్ట్ ఆల్‌రౌండర్ అనిపించుకున్నాడు. షకీబుల్ గొప్ప ఆటగాడే. కానీ అతడికి క్రమశిక్షణ విషయంలో మాత్రం సున్నా మార్కులు వేయొచ్చు. అనేక సార్లు మైదానంలోనే దురుసుగా ప్రవర్తించి ఐసీసీ వేటుకు గురయ్యాడు.

# ఓ గొప్ప ఆటగాడి దీనస్థితి!

అతనికి ఆటిట్యూడ్ ప్రాబ్లెం ఉందని స్వయంగా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డే వ్యాఖ్యానించింది. బోర్డుకు చెప్పకుండా సీపీఎల్‌లో ఆడటానికి వెళ్లాడని అతడిని దేశం తరపున ఆడకుండా నిషేధించింది. 2019లో యాంటీ కరప్షన్ కోడ్ 2.4.4 కింద ఐసీసీ అతడిని ఒక ఏడాది పాటు బ్యాన్ చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే మైదనంలో, మైదానం బయట అనేక వివాదాస్పద సంఘటనలు షకీబుల్ హసన్ కెరీర్‌లో ఉన్నాయి. షకీబుల్ ప్రవర్తన ఎలా ఉన్నా.. ఎన్ని సార్లు సస్పెన్షన్లు, బ్యాన్లు విధించినా.. ఆతను ఆటలో మాత్రం గొప్పగా రాణించాడు. అందుకే ఆతనికి బంగ్లాలో ఫ్యాన్స్ ఎక్కువ. ఈ నేపథ్యంలో షకీబుల్ క్రికెట్ ఆడుతూనే రాజకీయాల్లోకి ప్రవేశించాడు. 2023లో ఆయన అవామీ లీగ్ పార్టీలో జాయిన్ అయ్యాడు. 2024 జనరల్ ఎలక్షన్స్‌లో మగురా–1 సీటు నుంచి గెలిచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యాడు. ఇక్కడి నుంచే అతడి లైఫ్ టర్న్ అయ్యింది. ఇటీవల బంగ్లాలో హింస చెలరేగిన విషయం తెలిసిందే. షేక్ హసీనా ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేశారు. ఆమెకు చెందిన అవామీ లీగ్ పార్టీ నేతలను ఎవరినీ ప్రజలు వదిలిపెట్టలేదు. ఈ క్రమంలో హసీనాతో సహ అనేక మంది అవామీ లీగ్ నాయకులు దేశం వదిలి వెళ్లారు. షకీబుల్ హసన్ కూడా ఆ సమయంలో బంగ్లాదేశ్‌లో లేదు. అయితే ఆయనపై ఒక హత్య కేసు మాత్రం నమోదయ్యింది. బయటి దేశాల్లో క్రికెట్ ఆడుతూ స్వదేశానికి వెళ్లని షకీబుల్ హసన్.. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్నాడు. తన సొంత గడ్డపై చివరి టెస్టు ఆడే అవకాశం ఇవ్వమని కోరుకుంటున్నాడు. దక్షిణాఫ్రికాతో మీర్పూర్‌లో జరగనున్న టెస్టులో చివరి సారిగా ఆడి రిటైర్ అవుతానని బంగ్లా క్రికెట్ బోర్డును, అక్కడి ప్రభుత్వాన్ని కోరుతున్నాడు. ఆ మ్యాచ్ ఆడిన తర్వాత అసలు దేశంలోనే ఉండనని.. తన కుటుంబంతో సహా అమెరికా వెళ్లిపోతానని వేడుకుంటున్నాడు. ఒక వేళ తాను చివరి టెస్టు అక్కడ ఆడటానికి అవకాశం కల్పించకపోతే ప్రస్తుతం కాన్పూర్‌లో ఇండియాతో జరుగుతున్నదే ఆఖరి టెస్టు అవుతుందని చెప్పాడు. అయితే షకీబుల్‌కు భద్రత కల్పించే బాధ్యత మాది కాదని బంగ్లా క్రికెట్ బోర్డు అంటోంది. ఆవామీ పార్టీ ఎంపీగా గెలిచిన అతడి భద్రతను ప్రభుత్వమే చూసుకోవాలని చెబుతోంది. దీంతో ప్రస్తుతం షకీబుల్ హసన్ ఎటు వెళ్లాలో తెలియని ఇరకాటంలో పడ్డాడు. బంగ్లా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, భద్రత కల్పిస్తుందని ఆశిస్తున్నాడు. అతని స్నేహితులు మాత్రం తిరిగి బంగ్లాదేశ్‌కు రావొద్దని.. కుటుంబంతో కలిసి అటు నుంచి అటే అమెరికా వెళ్లిపోవాలని సలహాలు ఇస్తున్నారు. ఒక క్రికెటర్ కెరీర్ ఇలా అర్ధాంతరంగా ముగిసి.. దేశం నుంచి పారిపోయేలా చేస్తుందని ఎవరూ ఊహించలేదు. ఇదంతా షకీబుల్ హసన్ స్వయంకృతాపరాధమే అని సన్నిహితులు చెబుతుంటారు.

**- భాయ్‌జాన్**




**కథ:** బయటి ప్రపంచానికి దూరంగా.. సముద్రం ఒడ్డున ఉండే నాలుగు ఊర్లను కలిపి ఎర్ర సముద్రం అని పిలుచుకుంటారు అక్కడి జనం. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ వాళ్లు మన దేశం నుంచి కొల్లగొట్టి సముద్ర మార్గంలో తరలిస్తున్న దేశ సంపదను వారి నుంచి దోచుకుని సామాన్య జనానికి పంచడం ద్వారా ఇక్కడి వాళ్లు మంచి ప్రాచుర్యం పొందుతారు. కానీ కాల క్రమంలో సముద్రం మీద అక్రమంగా రవాణా అయ్యే వస్తువులను పట్టుకొచ్చి వాటి యజమానులకు అందించడం ఈ ఎర్రసముద్రంలో కొందరి జీవనాధారంగా మారుతుంది. ఐతే తాము చేస్తున్నది ఎంత పెద్ద తప్పిదమో కొంత ఆలస్యంగా గ్రహించిన ఈ బృంద నాయకుడు దేవర (జూనియర్ ఎన్టీఆర్).. ఇకపై ఈ పని ఆపేయాలని ఎర్రసముద్రంలో అల్టిమేటం జారీ చేస్తాడు. కానీ ఆ బృందంలోని భైరా (సైఫ్ అలీఖాన్)తో పాటు మరి కొందరికి దేవర ఆలోచన నచ్చదు. దీంతో వాళ్లు దేవరకు ఎదురెళ్తారు. ఈ క్రమంలో దేవర హఠాత్తుగా అదృశ్యమవుతాడు. దేవర ఆచూకీ కోసం భైరా.. తన మనుషులు వెతుకుతూనే ఉంటారు. మరోవైపు దేవరకు పూర్తి భిన్నమైన వ్యక్తిత్వం ఉన్న అతడి కొడుకు వర (ఎన్టీఆర్) ద్వారానే దేవర ఆచూకీ కనుగొనాలని ఎత్తుగడ వేస్తాడు భైరా. ఆ ఎత్తుగడ ఏంటి.. ఇంతకీ దేవర ఏమయ్యాడు.. భైరా పన్నాగం పారిందా.. ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

**సాంకేతిక వర్గం:**

అనిరుధ్ రవిచందర్ పాటలు.. నేపథ్య సంగీతం మంచి ఊపుతో సాగాయి. కానీ.. కొంచెం ఓల్డ్–ట్రెడిషనల్ సెటప్‌లో సాగే సినిమాలో తన మ్యూజిక్ మరీ ఆధునికంగా అనిపించి సింక్ కాలేదనిపిస్తుంది. హీరో ఎలివేషన్లు.. యాక్షన్ ఘట్టాల్లో అనిరుధ్ బీజీఎం అదిరిపోయింది రత్నవేలు ఛాయాగ్రహణం సినిమాకు అతి పెద్ద ఆకర్షణ. ప్రతి సన్నివేశంలోనూ విజువల్స్ కంటికింపుగా ఉండి ఆకట్టుకుంటాయి. నిర్మాణ విలువలు ఓకే. ఆర్ట్ వర్క్ బాగుంది. విజువల్ ఎఫెక్ట్స్ ఇంకా మెరుగ్గా ఉండాల్సిందనిపిస్తుంది. ఇక రైటర్ కమ్ డైరెక్టర్ కొరటాల శివ ఒకప్పటి సినిమాల స్థాయిలో వావ్ అనిపించలేదు. అదే సమయంలో 'ఆచార్య' తరహాలో నిరాశపరచనూ లేదు. ఆయ న ఎంచుకున్న కథ.. దాని నేపథ్యం బాగున్నాయి. కథనం ఇంకా మెరుగ్గా ఉండాల్సింది. సినిమాను రెండు భాగాలుగా చేయడం వల్ల పార్ట్–1ను కొంచెం సాగదీసినట్లు అనిపిస్తుం ది. పార్ట్–2 లీడ్ చూస్తే.. ఆయన 'బాహుబలి'ని ఫార్ములాను అనుసరించాడా.. ఆ సినిమా ప్రభావం తన మీద పడిందా అనిపిస్తుంది.

**నటీనటులు:** దేవరగా.. వరగా.. రెండు ఎన్టీఆర్ పెర్ఫామెన్స్ బాగుంది. ఈ రెండు క్యారెక్టర్లలో వైవిధ్యం చూపించాడు. ఆయా పాత్రలకు తగ్గట్లుగా తన గెటప్స్.. స్క్రీన్ ప్రెజెన్స్ బాగున్నాయి. కథలో కీలక సన్ని వేశాల్లో తారక్ ఎమోషన్లను బాగా పలికించాడు. దేవర పాత్ర లో రౌద్రాన్ని బాగా చూపించాడు. అక్కడక్కడా సాధారణంగా నడిచే సన్నివే శాలను కూడా తారక్ నిలబెట్టాడు. ఐతే ఆరంభంలో ఎగ్జైటిం గ్ గా అని పించే దేవర క్యారెక్టర్.. తర్వాత పట్టు తప్పడం నిరాశ కలిగిస్తుంది . జాన్వి కపూర్ 'చుట్ట మల్లే' పాట కోసమే సినిమాలో ఉందా అనిపిస్తుంది. ఆ పాటలో తన అందచందాలు కుర్రకారును బాగా ఆకట్టుకుంటాయి. తన పాత్ర మాత్రం నామమాత్రంగా అనిపిస్తుంది. నటన పరంగా ప్రత్యేకంగా చాటు కోవడానికి సరైన సీన్లే పడలేదు. విలన్ పాత్రలో సైఫ్ అలీ ఖాన్ ఓకే అనిపించాడు. భైరగా మొదట్లో తన గెటప్ సరిగా కుదరలేదు. వయసు మళ్లాక ఆ పాత్రకు సూటయ్యాడు అనిపిస్తుంది. సింగప్పగా కథను నరేట్ చేసే పాత్రలో ప్రకాష్ రాజ్ బాగానే చేశాడు. శ్రీకాంత్ మామూలు పాత్రలోనే కనిపించాడు. దేవర భార్య పాత్రలో శ్రుతి మరాఠె తన ప్రత్యేకతను చాటు కుంది. ఆమె చూడ్డానికి బాగుంది. నటన కూడా ఆకట్టుకుంటుంది. సుదేవ్ నాయర్ నెగెటివ్ రోల్ లో ఆకట్టుకున్నాడు. మిగతా నటీనటులు ఓకే.

# కొత్త ప్రపంచంలో పాత వినోదం!

**కథనం- విశ్లేషణ:**

మనం ఎప్పుడూ చూసే మనుషులను.. పరిస్థితులను.. సంఘటలను.. తెర మీద చూపిస్తే ప్రేక్షకులు ఈజీగా రిలేట్ చేసుకుని ఆ సినిమాతో కనెక్ట్ అయ్యేలా చేయడం ఒక ఎత్తు. ఇది ఎన్నో ఏళ్ల నుంచి జరుగుతున్న సాధారణ క్రతువే. ఐతే దీనికి భిన్నంగా ఒక ఊహాజనిత ప్రపంచాన్ని సృష్టించి.. అందులోని మనుషులను.. పరిస్థితులను.. సంఘటనలను గమ్మత్తుగా చూపించడం ద్వారా ప్రేక్షకులకు ఒక భిన్నమైన అనుభూతిని కలిగించడం మరో ఎత్తు. ఇప్పుడు చాలా మంది ఫిలిం మేకర్స్ రెండో మార్గాన్ని సక్సెస్ మంత్రగా ఎంచుకుంటున్నారు. 'బాహుబలి', 'కేజీఎఫ్' లాంటి చిత్రాలు ఇందుకు స్ఫూర్తిగా నిలిచాయి. ఐతే నేపథ్యం ఎంత కొత్తగా అనిపించినా.. సాంకేతికంగా ఎంత మాయాజాలం చేసినా.. ఆ ప్రపంచంతో ప్రేక్షకులు ఏదో ఒక రకంగా రిలేటవడం.. అక్కడ చూపించే పాత్రలతో ఎమోషనల్ కనెక్ట్ ఏర్పడడం చాలా కీలకం. అది జరిగినపుడు ఈ కొత్త ప్రపంచం తాలూకు హంగులు ఆకర్షణగా మారి సినిమాకు మంచి ఫలితం దక్కుతుంది. కానీ ఆ ఎమోషనల్ కనెక్ట్ ఏర్పడనపుడు.. ఆ ప్రపంచం కృత్రిమంగా తయారై మొత్తం వ్యవహారమే చెడిపోతుందనడానికి 'ఆచార్య' సినిమా ఓ ఉదాహరణగా నిలిచింది. ఒకసారి ప్రయత్నించి ఫెయిలైన కొరటాల శివ.. పంతం పట్టి మళ్లీ అలాంటి ఓ కొత్త ప్రపంచాన్నే సృష్టించి ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని పంచాలని 'దేవర'తో ట్రై చేశాడు.

బయటి ప్రపంచానికి దూరంగా అనగగనా ఓ ఎర్ర సముద్రం.. బ్రిటిష్ వాళ్లు కొల్లగొట్టి సముద్ర మార్గాన తరలించే దేశ సంపదను దోచుకునిపేద ప్రజలకు పంచే అక్కడి యోధులు.. కానీ కాల క్రమంలో ఓడల్లో సరకును దోచుకోవడాన్ని వృత్తిగా మార్చుకుని దొంగలుగా పేరు పడ్డ ఈ యోధుల వారసులు.. వారి మధ్య ఓ సంఘర్షణ.. అందులోంచి పుట్టుకొచ్చిన ఒక హీరో.. ఓ విలన్.. ఇలా సినిమా మొదలైన తీరు చూస్తే కొరటాల శివ కొంచెం భిన్నంగా.. భారీగా అనిపించే సెటప్‌తో కథ పరంగా కసరత్తు గట్టిగానే చేసినట్లు అనిపిస్తుంది. ఈసారి కూడా 'ఆచార్య' తరహా కృత్రిమత్వపు ఛాయలు కొంత కనిపించినా.. అది శ్రుతి మించకుండా చూసుకున్నాడు. కథ పరంగా వైవిధ్యం లేకపోవడం.. కథనం కూడా మామూలుగా సాగిపోవడం నిరాశ కలిగిస్తుంది. మూడు గంటల సుదీర్ఘ నిడివితో సాగిన సినిమాలో సన్నివేశాలు ఏదో అలా సాగిపోతుంటాయి తప్ప.. వారెవా అనిపించే ఎపిసోడ్లు లేకపోవడంతో 'దేవర' గ్రాఫ్‌ను తగ్గిస్తుంది.

జూనియర్ ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేసిన 'దేవర' సినిమాలో పెద్ద ఎన్టీఆర్ పాత్రే కథకు అత్యంత కీలకం. ఆ పాత్ర సినిమాలో కనిపించేది తక్కువ సమయమే అయినా.. దాని తాలూకు ప్రభావం సినిమా అంతా కొనసాగుతుంది. ఐతే ఆ పాత్రను ఇంకా బాగా ఎస్టాబ్లిష్ చేసి ప్రేక్షకులకు బలంగా రిజిస్టర్ చేయాల్సింది. కథ.. పాత్రలు.. మలుపుల పరంగా 'బాహుబలి' స్ఫూర్తి కనిపిస్తుంది కానీ.. ఆ సినిమాలో మాదిరి ప్రధాన పాత్రతో ప్రేక్షకులకు ఎమోషనల్ కనెక్ట్ ఏర్పరచలేకపోయాడు. అందరిలో ఒకడిలా ఉన్న హీరోలో ఒక పరివర్తన రావడానికి బలమైన కారణం కనిపించదు. ఆ మార్పు తర్వాత అతను ఒక నాయకుడిగా.. ప్రత్యేకమైన వ్యక్తిగా మారే క్రమాన్ని ఇంకా బలంగా చూపించాల్సింది. దేవర పాత్రకు అవసరమైన వెయిట్ ఎన్టీఆర్ తన పెర్ఫామెన్స్ తో తీసుకొచ్చినా కొరటాల తన వైపు నుంచి ఇంకా ఆ పాత్రను పుష్ చేయాల్సిందనిపిస్తుంది. దేవర గురించి అందరూ ఆహా ఓహో అని చెప్పడం.. విపరీతమైన బిల్డప్ ఇవ్వడమే తప్ప.. దృశ్యరూపంలో దాన్ని ఫీల్ కాలేం. ఎర్రసముద్రం నేపథ్యంలో కథ మొదట్లోనే ప్రేక్షకులను సినిమాలో ఇన్వాల్వ్ చేయిస్తుంది. కానీ కథ పరంగా ఏదో ఒక దశలో ఆశ్చర్యపరిచే విషయం ఉంటుందని.. వర పాత్ర రంగప్రవేశంతో కొత్త ఉత్సాహం వస్తుందని.. జాన్వి కపూర్ పాత్రలోనూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని ఆశిస్తే.. ఇవన్నీ కాస్త నిరాశ కలిగిస్తాయి. తారక్–జాన్వి ట్రాక్ చాలా రొటీన్‌గా అనిపిస్తుంది. 'చుట్ట మల్లే..' పాటలో జాన్వి అందంగా కనిపించి ఆకట్టుకుంటుంది కానీ.. అంతకుమించి ఏ ప్రత్యేకతా లేదు. ద్వితీయార్ధంలో ఎర్ర సముద్రం వ్యవహారం రొటీన్‌గా.. సాగతీతగా అనిపిస్తుంది. 'దేవర' కథ.. వర పాత్రకు సంబంధించిన ట్విస్టు గురించి ఆల్రెడీ సామాజిక మాధ్యమాల్లో ఓ ప్రచారం నడిచింది. సినిమాలో దీనికి భిన్నంగా.. ఆశ్చర్యపరిచేలా ఏమీ లేకపోవడమే ట్విస్ట్. 'దేవర' కోసం కొరటాల ఎంచుకున్న నేపథ్యం ఈ సినిమాకు పెద్ద ఎసెట్. దీని వల్ల సినిమాకు ఒక కొత్త లుక్ వచ్చింది. కథ పరంగా రొటీన్ అనిపించినా.. ప్రేక్షకులను ఎంగేజ్ చేసే కమర్షియల్ అంశాలకు లోటు లేదు. తారక్ కోసం.. యాక్షన్ ఘట్టాల కోసం.. సాంకేతిక హంగుల కోసం 'దేవర'పై ఓ లుక్కేయొచ్చు. పార్ట్–2 కోసం ఇచ్చిన లీడ్ చూస్తే 'బాహుబలి' ఛాయలు కనిపిస్తాయి. అయినా సరే రెండో భాగం మీద ఆసక్తి రేకెత్తించగలిగాడు కొరటాల.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**




ఎవ్వరిది వాళ్లు ఎంత సంపాదించామా.. ఎంత
మంచి ఇల్లు కట్టామా.. ఎన్ని ఇళ్లు కొనగలం. ఎన్ని
భూములను సొంతం చేసుకోగలం. ఎన్ని ఆస్తులు
కూడగట్టుకోగల మని యోచించే జమానా ఇది.
కానీ, ఇలాంటి రోజుల్లో కూడా ఇతరులకు సేవ
చేసేందుకు డబ్బు సంపాదించా లనేవాళ్లూ ఉన్నారం
టే.. ఎక్కడో ఇంకా కొంత మంచి బతికున్నట్టే! కాస్త
అతిశయోక్తిగా అనిపించినా స్ఫూర్తినిచ్చే నిజమైన ఈ
మిషన్ వన్ రూపీ కథ మీరూ ఓసారి చదవేయండి!

# సైకిలెక్కి దేశదిమ్మరులెందుకయ్యారు?

మీ వంతుగా జస్ట్ ఒక్కరూపాయి సాయం చేయండి చాలు అని ఓ ఫ్లకార్డ్ పట్టుకుని బయల్దేరారు ఆ ఇద్దరు స్నేహితులు. అడుక్కుంటున్నారనుకుంటున్నారా..? అవునూ.. నిజమే! కానీ, వారికోసం కాదు.. పేదల కోసం.. బ్రిటీషర్స్ వెళ్లిపోయాక కూడా కూడు, గూడు, గుడ్డ కోసం ఆకలితో అలమటిస్తున్న దేశంలోని బీదలపాట్ల కోసం. నిలువ నీడలేని వారికి ఇంత ఆశ్రయం కల్పించే ఉద్దేశ్యంతోనే యాదృచ్ఛికంగా దోస్తులైన ఓ ఇద్దరు కలిసి చేపట్టిన సైకిల్ యాత్ర ఇది.

నిజిన్ కే.జీ, టీ.ఆర్. రెనీష్.. ఈ ఇద్దరూ కేరళైట్స్. నిలువ నీడలేని నిరుపేదలకు ఇళ్లు కట్టించే యోచనతో భారత్ మొత్తం సైకిల్ యాత్రను చేపట్టింది ఈ దోస్తుల జోడీ. ఇప్పటికే వందల కిలోమీటర్లు చుట్టేసిన వీరి యాత్ర.. అలుపెరుగని సమర్థుల జీవయాత్ర. అందుకే, ఇంకా ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే వీరు తిరిగిన ప్రాంతాల్లో వీరి మోటో తెలుసుకుని రూపాయి రూపాయి ఇచ్చినవారందరి డబ్బూ కలిపి.. సుమారు 2 కోట్లకు పైగా విరాళాలు పోగయ్యాయి. అయితే వీరి స్టోరీయే జనాన్ని ఇన్స్పైర్ చేస్తుంటే వీరిని ఓ బుడతడు ఇన్స్పైర్ చేసిన విధానం ఇంకా విశేషం.

కేరళలోనే రాజపురం అనే గ్రామానికి చెందిన నివిన్ రోనీ అనే 9 ఏళ్ల బాలుడు చిన్ననాట్నుంచి తన తల్లిదండ్రులు, ఇతర బంధువులెవరైనా ఇచ్చిన డబ్బుల్ని రూపాయి రూపాయి గల్లాపెట్టెలో పోగుచేశాడు. ఆ మొత్తం తను 9 ఏళ్ల వయస్సుకొచ్చేసరికి.. సరిగ్గా 11 వందల 17 రూపాయలయ్యాయి. అయితే ఆ డబ్బును ఆ బుడ్డోడు తనకు కావల్సిన ఏ బొమ్మో, చాక్లెట్టో, బిస్కట్టో కొనేందుకు ఉపయోగించుకోకుండా పేదల ఇళ్ల నిర్మాణానికై సైకిల్ ఎక్కి బయల్దేరిన ఆ ఇద్దరు యువకులకిచ్చి.. వారిలో మరింత స్ఫూర్తి నింపాడు.

అలాగే మరో నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థి ఒకరు కూడా ఇలాగే నిజిన్, రెనీష్ జోడీ సైకిల్ యాత్ర గురించి యూట్యూబ్‌లో చూసి తాను సైకిల్ కొనడానికి జమ చేసుకున్న డబ్బుల్ని ఈ జోడీకిచ్చేశాడు. తన సైకిల్ కొనడాన్ని మరి కొంత కాలానికి వాయిదా వేసుకుంటున్నట్టు చెప్పి ఏ ఉద్దేశ్యంతోనైతే నిజిన్, రెనీష్ ఆ సైకిల్ యాత్రను చేపట్టారో దాన్ని మరింత విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు చోదకమయ్యాడు.




**ప్రాజెక్ట్ సీరియస్ నెస్ గురించి చెప్పడానికే సైకిలెక్కిన బాటసారులు!**

వాస్తవానికి నేటి సోషల్ మీడియా యుగంలో ఒక్క క్లిక్కుతో క్రౌడ్ ఫండ్ రైజింగ్‌కు అవకాశముంది. కానీ, తామెందుకు తిరుగుతున్నామో.. వారి మోటో వెనుక ఉన్న సదుద్దేశ్యమేంటన్నవి నిజాయితీగా చెబుతారు వీరిద్దరు. తమ మిషన్ ను ప్రజలు సీరియస్‌గా తీసుకోవడానికే.. నేరుగా సైకిల్ యాత్రైతేనే బెటర్ అని యోచించారట ఈ ఇద్దరు దోస్తులు. తమ టాస్క్ పూర్తి చేయగల్గేందుకు సోషల్ ఫ్లాట్ ఫామ్స్ ద్వారా ఏ కష్టం లేకుండా ఇంకా పెద్దమొత్తంలో డబ్బులు కలెక్ట్ చేయడానికి ఆస్కారమున్నా అలా చేయకుండా తమ నిజాయితీని చాటుకునే యత్నంలో సైకిల్‌పై రాష్ట్రాల సరిహద్దులు దాటేస్తున్నారు ఈ బాటసారులు.

2021, డిసెంబర్ 10వ తేదీన తమ సైకిల్ జర్నీని ప్రారంభించారు ఈ బాటసారులు. తమ ప్రయాణంలో తమకందిన విరాళాలను ప్రతీ రెండు రోజులకొకసారి బ్యాంకులో జమ చేస్తారు. ఇప్పటికే వందల కిలోమీటర్లు దాటిన వీరి సైకిల్ ప్రయాణం..400 గ్రామాల మీదుగా సాగుతూనే ఉంది. అంబలవాయల్‌కు చెందిన రెనీష్.. వాయనాడ్ కు చెందిన నిజిన్ స్నేహమూ.. ఈ మోటో ప్రాతిపదికగానే బలపడి ఇలా సైకిల్ యాత్రకు పురిగొల్పడమూ ఈ కథలో మనకు కనిపించే మరో విశేషం.

ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న నిజిన్ తన మోబైల్ రిపేర్ కోసం మొబైల్ షాపుకు వెళ్లడం.. అక్కడ మాజీ సేల్స్ పర్సనైన రెనీష్ కలవడం.. మాటామాటా కలిసి ఇద్దరూ ఇలా ఓ సామాజిక ప్రయోజనం కోసం జట్టు కట్టి సైకిల్ యాత్రకు బయల్దేరడం.. ఇలా అన్నీ చకచకా జరిగిపోయాయి. సుమారు నెలరోజుల పాటు తమ సైకిల్ యాత్ర కోసం ప్లానింగ్ చేసుకున్నారు. కానీ, ఇరువురి ఇళ్లలో ముందు కొంత అభ్యంతరాలు వ్యక్తమైనా వారి ఆలోచనకు ఫిదా అయిన కుటుంబీకులు కూడా అనుమతించడం.. వీరి యాత్ర వివరాలు తెలుసుకున్న రెనీష్ మిత్రుడు కేవలం ఏడు లక్షల రూపాయలకే ఇళ్ల నిర్మాణం కోసం 20 సెంట్ల భూమిని కారుచౌకగా ఇచ్చేశాడు. అంతేకాదు నిర్మాణ సామాగ్రికి కూడా తన వంతు సాయమందించాడు. లోన్‌తో భూమి కొన్న ఈ ఇద్దరు మిత్రులు.. వాటిని ఈఎంఐల రూపంలో తీర్చేస్తూ.. మరోవైపు బీదల కోసం ఇళ్ల నిర్మాణం వైపు అడుగులేయడం అందరినీ ఆకట్టుకుంటోంది.

అయితే, సైకిల్‌పై ప్రయాణాలు చేయడమనేది ఇప్పుడు చాలా మందికి ఫ్యాషన్‌గా మారిపోవడం.. అలాగే, పర్యావరణ పరంగా వాహనాలతో తలెత్తుతున్న ముప్పును నివారించాలన్న ఉద్దేశ్యంతో సైకిల్ యాత్రను ప్రోత్సహిస్తుండటం వంటివి ఇప్పటి వరకూ చూస్తూ వచ్చాం. కానీ, ఇలా ఒక్క రూపాయి మిషన్ పేరుతో సైకిల్ యాత్రతో నిజిన్, రెనీష్ స్నేహితుల జోడి వార్తల్లో వ్యక్తులయ్యారు. అయితే, వీరి గమనంలో ఎన్ని విజయాలో.. అన్ని చేదు అనుభవాలూ కనిపించాయంటారు. ఎక్కడెక్కడో మారుమూల ప్రాంతాల్లో సైకిల్స్ పంక్చర్లవ్వడం నుంచి.. ఒక్కరూపాయి ఇవ్వమని అడగటాన్ని ఎగతాళి చేసేవారు.. ఇవ్వనివారు.. ఎక్కడెక్కడో నిద్రలేని రాత్రులు గడపడం.. ఇలా ఎన్నో చేదు-తీపి అనుభవాల సారంగా సాగుతున్న వీరి సైకిల్ యాత్ర..పేదల ఇళ్ల నిర్మాణంకై వీరు చేపట్టిన టాస్క్ .. నిజంగా ఓ నిస్వార్థపు రిస్క్ ఫ్యాక్టర్.

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## కళింగపట్నం బీచ్‌లో షూటింగ్ సందడి

(సత్యంన్యూస్, గార)



కళింగపట్నం, బందరువానిపేట బీచ్‌లలో ఆకలి మూవీ పాటల చిత్రీకరణ కోలాహలంగా జరిగింది. హీరో, హీరోయిన్‌లు అభిరామ్, స్రవంతి, ప్రతాప్, హాసినిలపై పాట చిత్రీకరణ జరిగింది. షూటింగ్‌ను ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో దర్శక, నిర్మాత గూన అప్పారావు, ఆర్టిస్టులు బమ్మిడి కృష్ణారావు, సనపల అన్నాజీ, శంకర్‌లు పాల్గొన్నారు. షూటింగ్ అనంతరం చిత్ర దర్శక, నిర్మాత గూన అప్పారావు మాట్లాడుతూ పాటల చిత్రీకరణ పూర్తయిందని, త్వరలో పాటలు రిలీజ్ చేస్తామన్నారు. ఈ చిత్రానికి దర్శక, నిర్మాత గూన అప్పారావు, సంగీతం చిన్ని కృష్ణ, కోరియోగ్రఫీ బండ్ల రామారావు అందిస్తున్నారు.

## ప్రసాదాల తయారీ పరిశీలన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో తయారుచేస్తున్న ప్రసాదాలను జిల్లా ఆహార నియంత్రణ అధికారి కె.వెంకటరత్నం శుక్రవారం తనిఖీ చేశారు. దేవస్థానంలో తయారు చేస్తున్న ప్రసాదాల నాణ్యత పరిశీలించారు. ప్రసాదాల తయారీకి ఉపయోగించే ఆవు నెయ్యి (విశాఖ డెయిరీ) శనగపప్పు, మసాలా దినుసులు పరిశీలించినట్లు చెప్పారు. నాణ్యతను పరిశీలించడానికి శాంపిల్స్ సేకరించి ప్రయోగశాలకు పంపామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రసాదాలు తయారుచేసే ప్రాంతం, పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నివేదికల్లో తేడాలుంటే చర్యలు తప్పవన్నారు. పరిశీలనలో సహాయ ఆహాయ నియంత్రణాధికారిణి లక్ష్మి పాల్గొన్నారు.




## బహిరంగ ప్రకటన

నా క్లయింటయిన **సకలాభక్తుల మల్లిఖార్జునరావు అలియాస్ బుజ్జి,** S/o **లేటు విశ్వనాథం,** మేనేజింగ్ పార్టనర్ **సకలాభక్తుల విశ్వనాధం&మల్లిఖార్జునరావు,** R/o. Door No.33/A, ఫస్ట్‌ఫ్లోర్, గవర్నమెంటు వెటర్నరీ హాస్పిటల్ ఎదురుగా, అరసవల్లి రోడ్, శ్రీకాకుళం టౌన్ వారు ఇచ్చిన భోగట్టాపై యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా! "పైన తెలిపిన నా క్లయింటు బాకీ సొమ్ము అనగా రూ. 61,03,845/- మరియు రూ.49,57,103/- అసలుపై సాలీన 24% వడ్డీ దావా వేసిన నాటి నుండి బాకీ వసూలైన తేదీ వరకు మరియు ఖర్చులతో సహా వసూలు చేయు నిమిత్తం **భోగెల వెంకటశేఖర్** S/o **లేటు సోమశేఖరరావు** మరియు **భోగిల రాజేశ్వరి** W/O **భవాని వెంకటశేఖర్** ప్రతివాదులపై శ్రీకాకుళం నాల్గువ అదనపు జిల్లా జడ్జి వారి కోరులో O.S. No. 34/24 దావా వేసినారు. సదరు దావాలో I.A. No.442/2024 లో నా క్లయింటు అభ్యర్ధన మేరకు కోర్టు వారు వేసిన ఆర్డర్ ప్రకారం ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థిని అటాచ్మెంట్ (Prior to Decree and Judgement) చేయడం జరిగింది. సదరు షెడ్యూల్ దాఖలా ఆస్తిని పైన తెలిపిన ప్రతివాదులు కోర్టు అటాచ్మెంట్ ఉన్నదని తెలియజేయకుండా మోసపూరితంగా ఇతరులకు అమ్మజూపుచున్నారు. కావున షెడ్యూల్ దాఖలా ఆస్తి విషయంలో ఎవ్వరు కూడా ఎటువంటి క్రయవిక్రయాలు గానీ లావాదేవీలు గానీ జరుపరాదనియు మరియు అట్లు జరిపిన యెడల అట్టి వ్యవహారంలు చెల్లనేరవనియు, వారి సొమ్ము నష్టపోవుదురనియు మరియు అట్టి వ్యవహారంలు నా క్లయింటును బంధింపవనియు అట్టివారిపై నా క్లయింటు తీసుకొనబోయే చట్టపరమైన సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.

**NOTICE SCHEDULE:**

Srikakulam District, Srikakulam Mandalam, Town and Municipality, Srikakulam Sub-Registrar, RCC slabbed ground and 1st floor building abutting the road and RCC slabbed ground floor building in the rear side of the said property, situated in Survey No.315 part and 315/2, RS.No.182/156p, Manguvari Thota area, towards east of Ramnagar Mondeti veedhi within the following boundaries: **East:** Subbalakshmi Apartment Towers, **South:** Property of Muddanuru Satyanarayana raju, **West:-** Ramnagar-Mondenti Cement Road, **North:-** Property of Sadasivuni Prasanth.

**బరాటం నాగేశ్వరరావు**
బి.కామ్.,బి.ఎల్. అడ్వకేట్, చిన్న బరాటం వీధి, శ్రీకాకుళం.
Cell:9391380645


## క్షతగాత్ర వృద్ధురాలికి రక్తదానం



(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి మండలం నౌపడ ఆర్.ఎస్ గ్రామానికి చెందిన జీరు చెంచమ్మ అనే వృద్ధురాలు దురదృష్టవశాత్తు కాలు జారిపడిపోవడంతో మక్కకు సంబంధించిన ఎముక విరిగిపోయింది. టెక్కలి జిల్లా ఆసుపత్రి వైద్యులు ఆపరేషన్ సమయంలో ఎ.బి. పాజిటివ్ రక్తం ఎక్కించాలని తెలిపారు. బంధువులు ఎవరూ రక్తదానం చేయడానికి అందుబాటులో లేకపోవడంతో చెంచమ్మ కుటుంబసభ్యులు టెక్కలి అభయం యువజన సేవాసంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావును కలవడంతో వెంటనే స్పందించిన వారు జిల్లా హాస్పిటల్ బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులతో మాట్లాడి రక్తంను డాక్టర్ బి సునీత చేతుల మీదుగా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, ట్రెజరర్ శ్రీనివాస బెహరా, సంఘం సభ్యులు జలుమూరు శశిభూషణ్ పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన ఐఐఐటీ డైరెక్టర్

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

వివిధ క్రీడల్లో రాణించిన ఐఐఐటీ విద్యార్థులను డైరెక్టర్ బాలాజీ శనివారం అభినందించారు. ఈనెల 27న శ్రీకాకుళంలో జరిగిన రన్నింగ్, షార్ట్‌పుట్ పోటీల్లో యూనివర్సిటీకి చెందిన ఐఐఐటి విద్యార్థిని రెడ్డి శివ సాయి, పి.రామారావు, పియుసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి స్టేట్‌లెవెల్ పోటీలకు ఎంపికయ్యారు. దీంతో వీరికి డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, క్యాంపస్-2 ఇన్‌చార్జ్ సాగర్, ఫైనాన్స్ ఆఫీసర్ మోహనరావు, డీన్ వెల్ఫేర్ గేదెల రవి,ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంకు చెందిన రాజు, దిలీప్ పాల్గొన్నారు.





శ్రీకాకుళం ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగం డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలు ముఖ్యమైన అంశాలపై ఇరువురు చర్చించారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం

























## గ్రంధాలయంలో భగత్‌సింగ్ జయంతి

(సత్యంన్యూస్, లావేరు)

స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళిర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఢిల్లీ వీధుల్లో ఎర్రకాగితాలను చల్లి ప్రజలను చైతన్య పరిచారన్నారు. భారత స్వతంత్ర ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారుల్లో భగత్‌సింగ్ ఒకరని తెలిపారు. భగత్‌సింగ్ జీవితచరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో చరిష్మాకు ప్రథమ, హేమంత్‌కు ద్వితీయ బహుమతి పొందారు. వీరికి గ్రంథాలయం తరుపున బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ నీలిమ, ప్రిన్సిపాల్ టి.బాలరాజు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉచితంగా భగవద్గీత పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం జిల్లాశాఖ ఆధ్వర్యంలో మానవాళికి భగవద్గీత పుస్తకంను టీటీడీ ద్వారా ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ ఎం.లలితమణి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులందరికీ పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. పుస్తకం కోసం 9866914160, 9553745950 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.



స్థానిక 24వ డివిజన్ మహాలక్ష్మినగర్ కాలనీలో యువత ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చౌదరి సతీష్, రౌతు సూర్యనారాయణ, విగ్రహదాత యాబాజీ అనిల్, జ్యోతి దంపతులు, పైల వెంకటరమణ, సుజాత దంపతులు, వ్యాపారి రామకృష్ణ ,లక్ష్మి దంపతులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం

జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదలై విజయవంతమైన సందర్భంగా జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు స్టేట్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ దుంగ శ్రీధర్ ఆధ్వర్యంలో నగర ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అధ్యక్షులు స్టేట్ కన్వీనర్ బుర్రి మధు ఆధ్వర్యంలో శనివారం విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సరస్వతి థియేటర్ మేనేజర్ చిన్నరాజు, దుంగ బాస్కర్, ముద్ద మధు, గంగరాజు, ప్రసాద్, మల్లి, ప్రసాద్, సూరిసెట్టి ఈశ్వరరావు, శంకర్, అయ్యప్ప, సాయిలు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం




## రాజకీయ స్వార్థం కోసమే కల్తీ నాటకం



(సత్యంన్యూస్, టెక్కలి)

చంద్రబాబు చెబుతున్న అబద్దాలను, చేస్తున్న మోసాలను ప్రక్షాళన చేయాలని కోరుతూ స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం వైకాపా ఇన్‌చార్జ్ పేరాడ తిలక్, భార్గవి దంపతులు, పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ శ్రీవారి లడ్డు తయారీలో కల్తీనెయ్యిని వాడకుండానే వాడినట్టు ప్రచారం చేసి చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తూ జగన్మోహన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. లడ్డును రాజకీయం కోసం చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు వాడుకుని శ్రీవారిని అపవిత్రం చేశారన్నారు. చంద్రబాబు దుర్మార్గాలు బయటకు రావడంతో టాపిక్‌ను డైవర్ట్ చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో పలుమార్లు సందర్శించి పట్టువస్త్రాలు సమర్పించారని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మెట్ల మార్గంలో వెళ్లి దర్శించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డిని తిరుమల రానివ్వకుండా డిక్లరేషన్ పేరుతో అడ్డుకున్నారని ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డిపై దాడులు చేసేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. బాబు నీచరాజకీయాలను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు ఆట్ల రాహుల్ సరోజినమ్మ, నడుపూరు శ్రీరామమూర్తి, రోణంకి ఉమా మల్లేశ్వరరావు, మేరుగ అప్పారావు, రాజ్యలక్ష్మి, దుబ్బ వెంకటరావు, పాల వసంతరెడ్డి, టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల పార్టీ అధ్యక్షులు, జెసిఎస్ కన్వీనర్లు మండల పరిషత్ ఉపాధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు, వైకాపా సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య అగ్గిబరాటా భగత్ సింగ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వాతంత్ర పోరాటంలో అగ్గిబరాటాలా బ్రిటిష్ సైన్యాలకు ఎదురొడ్డిన దీశాలి భగత్‌సింగ్ అని వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధులు సంఘసంస్కర్తల స్మృతి వనంలో స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి శనివారం నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి దాతలు నేమాని వేదవతి దేవి శ్యాంప్రసాద్ కుటుంబంతో పాటు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు, ప్రముఖులు డాక్టర్ జామి భీమశంకర్, సురంగమోహన్రావు, పైడి హరినాధరావు, నిష్ఠల నరసింహమూర్తి, కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్, ఎంఎస్ఎస్ గుప్తా, గుత్తు చిన్నారావు బృందం పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో భగత్‌సింగ్ పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ప్రజల్లో స్వాతంత్ర కాంక్షను రగిలించి చిన్నతనంలోనే ఉరికంబాన్ని ముద్దాడి భరతమాత కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ధీరుడు అన్నారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకి ప్రతి భారతీయుడు జీవితాంతం రుణపడి ఉండాలన్నారు. దేశభక్తికి త్యాగస్ఫూర్తికి ప్రతిరూపంగా వీరు నిలుస్తారన్నారు. అనంతరం పండితులు పైడి హరినాధరావు, నిష్ఠల నరసింహమూర్తి బృందం భగత్‌సింగ్ గొప్పతనాన్ని కీర్తిస్తూ గేయాలు ఆలపించారు. ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావును గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెంకి చైతన్యకుమార్ మెట్ట అనంతంభట్లు, శాస్త్రి, సువ్వారి రాజారావు తదితరులు ఉన్నారు



## జగనన్న కాలనీల్లో మౌళిక వసతులు కల్పిస్తాం

**– లబ్ధిదారులకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే శంకర్**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

జగనన్న కాలనీల్లో మౌళిక వసతులు కల్పించి వచ్చే మార్చి నాటికి బిల్లులు చెల్లిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టం చేశారు. వాకలవలసలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీల్లోని ఇళ్లను ఎమ్మెల్యే శంకర్ అధికారులతో కలసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల ఇంటికలను నెరవేర్చేందుకు ఇళ్లను మంజూరు చేస్తే వైకాపా మంజూరు చేసినట్టుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక రూపాయి మాత్రమే ఇళ్ల నిర్మాణానికి మంజూరు చేసిందని వివరించారు. దీంతో కాలనీల్లో కనీస వసతులు కూడా కల్పించకుండా వైకాపా ప్రజలను తీవ్రంగా ధగా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు కాలనీలను పరిశీలించి ప్రజలకు భరోసా కల్పించాలని ఎమ్మెల్యేలకు సూచించారని వివరించారు. 2025 మార్చిలోగా ఇళ్ల బిల్లులను పూర్తిస్థాయిలో చెల్లిస్తామని చెప్పారు. 2014-19 మధ్య కాలంలో ఎన్‌టీఆర్ హౌసింగ్ స్కీం పేరుతో తాము ఇళ్లను మంజూరు చేస్తే 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా దానిని జగనన్న కాలనీలుగా పేరు మార్చిందన్నారు. మన ఇళ్లు-మన గౌరవం పేరిట జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా నిలిచిన ఇళ్లను పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులకు బిల్లులు చెల్లించేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఆయా కాలనీల్లో మెరుగైన సౌకర్యాలు అందజేయడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాద్, మండల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



**అద్దెకొరకు**

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

– సంప్రదించగలరు –

**94403 72300, 98487 96626**

## అధికారం పోతే ఇట్టుంటదా?

(మొదటిపేజీ తరువాయి)

ఆయన ఒక ప్రకటన విడుదల చేసుంటే ఈ కార్యక్రమం విజయవంతమైవుండేది. అలా కాకుండా ధర్మాన బంగ్లాకే పరిమితమైపోయి మరొకరికి బాధ్యతలు అప్పగించకుండా పార్టీని ఏం చేస్తున్నారని సోషల్‌మీడియా వేదికగా అనేక ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మరీ ముఖ్యంగా కాళింగ సామాజికవర్గ గ్రూపుల్లో ధర్మాన మీద, ఆయన ఇటీవల వ్యవహరిస్తున్న తీరు మీద నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. కేవలం ధర్మాన తన వ్యాపారాలు కాపాడుకోవడం కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎటువంటి స్టేట్‌మెంట్లు ఇవ్వడంలేదని సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ బాధ్యతలు మరొకరికి అప్పగించకుండా తన సోదరుడ్ని ముందుపెట్టి గేమ్ ఆడుతున్నారని, రెండుమూడేళ్ల పాటు ఈ విధంగా నడిపేసి, ఆ తర్వాత మళ్లీ తానున్నానంటూ యాక్టివ్ అవుతారని, అటువంటి వారినే పార్టీ నమ్ముతుందని ఆ మధ్య టెక్కలి గ్రూపుల్లో కొన్ని కథనాలు సోషల్ మీడియాలో తిరిగాయి. వాస్తవానికి శ్రీకాకుళం నియోజకవర్గంలో కూడా కేడర్ ఇలాంటి భావనతోనే ఉంది. ఎన్నికలకు ముందు అయినదానికి, కానిదానికి పరామర్శించడం, సమస్యను పరిష్కరించామని చెప్పడం వంటి పబ్లిసిటీతో నిత్యం మీడియాలో కనిపించే ధర్మాన తనయుడు రామ్‌మనోహర్‌నాయుడు ఎన్నికల తర్వాత ఏమయ్యారని స్థానిక కేడర్ ప్రశ్నిస్తోంది. అసలింతకీ ధర్మాన పార్టీలో ఉన్నట్టా? లేనట్టా? అన్న సందేహం ఆ పార్టీ నేతల్లో కూడా ఉంది.

ఎన్నికల తర్వాత ధర్మాన అలకపాన్పుపై ఉన్నారన్న విషయం పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి తెలుసు. అలా అని ఏం జరిగిందని ధర్మానను అడిగే ప్రయత్నం ఆయన చేయడంలేదు. చేస్తారన్న నమ్మకమూ లేదు. ఎందుకంటే.. తన దగ్గరి బంధువు, తాను కాంగ్రెస్‌ను వీడినప్పుడు మంత్రి పదవిని సైతం వదులుకొని వచ్చిన బాలినేని శ్రీనివాస్ పార్టీ విడిచిపెట్టినప్పుడే పోతే పోనీ అని వదిలేసిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు అలిగినవారిని బుజ్జగిస్తారని ఊహించక్కర్లేదు. అలా అని ఈ జిల్లాలో ధర్మానను వదులుకోడానికి కూడా జగన్మోహన్‌రెడ్డి సిద్ధంగా లేరు. ఆయన లేకపోతే పార్టీకి జరిగే నష్టం జగన్‌కు తెలుసు. రెండున్నరేళ్ల తర్వాత మంత్రి పదవుల షఫ్లింగ్ చేసినప్పుడు కృష్ణదాస్‌ను పెద్దిరెడ్డి, బొత్స సత్యనారాయణ లాగే మరో రెండున్నరేళ్లు కొనసాగిస్తారని చెప్పినప్పటికీ ధర్మాన ప్రసాదరావుకే ఆ పదవి ఇవ్వాలని ధర్మాన కృష్ణదాస్ చెప్పి, అందువల్ల పార్టీకి వచ్చే లాభాలను కూడా చెప్పినప్పుడే ఆయన సత్తా జగన్మోహన్‌రెడ్డికి తెలిసింది. ఆ తర్వాత మంత్రి పదవి ఇచ్చినా ఎక్కడా ప్రసాదరావుకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఆ మాటకొస్తే రాష్ట్రంలో ఏ మంత్రికీ జగన్మోహన్‌రెడ్డి పాలనలో కనీస గుర్తింపు లేదు. ఇప్పుడు కూడా ధర్మాన ప్రసాదరావు అలిగివున్నారనే కారణంతోనే కృష్ణదాస్‌ను మరోసారి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగించారు. వాస్తవానికి ఈ పదవిని తమ్మినేని సీతారామ్‌కు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ధర్మాన కృష్ణదాస్‌కు పదవిస్తే ధర్మానను యాక్టివ్ చేసే బాధ్యత ఆయన చూసుకుంటారని జగన్ భావించారు. ఇప్పుడు జగన్ ఎత్తుగడకు పైఎత్తు వేస్తూ అదే కృష్ణదాస్‌తో నియోజకవర్గంలో కార్యక్రమాలను ధర్మాన ప్రసాదరావు నడిపేస్తున్నారు. పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కార్యకర్తలు డీలా పడిపోవడం సహజం. అలా అని పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వీరేమైనా బావుకున్నారా అంటే..అదీ లేదు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకపోయినా వీరికి ఒకటే. కేవలం జిల్లా, నియోజకవర్గంలో ధర్మాన దృష్టిలో పడాలనే ఎక్కువ మంది నాయకులు కార్యక్రమాలకు హాజరవుతుంటారు. ఇప్పుడు అటువంటి ధర్మానే పార్టీ నిర్దేశించిన కార్యక్రమానికి రాకపోవడంతో వెళ్లి ఏం సాధించాలన్న కోణంలో కనిపించడం మానేస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో 40శాతం ఓటుబ్యాంకు వైకాపాకు ఉందని తేలడం వల్ల పార్టీ మారేందుకు ధర్మాన ఇష్టపడటంలేదని, ఆ సంఖ్య తగ్గివుంటే ఆయన కచ్చితంగా పార్టీ వీడిపోయేవారంటూ ధర్మాన వ్యతిరేకులు వాట్సాప్‌లలో ఊపేస్తున్నారు. శనివారం నారాయణ తిరుమలలో జరిగిన కార్యక్రమంలో ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారు, రూరల్, గార మండలాలకు సంబంధించినవారు మినహా నగరంలో ధర్మాన బంగ్లా చుట్టూ గబ్బిలాల్లా వేలాడేవారు ఎవరూ కనిపించలేదు.

## రేబీస్ వ్యాధిపై అవగాహన

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పొన్నాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని అఖింఖాన్‌పేట గ్రామంలో వైద్యాధికారి ఎన్.శేషగిరి ఆదేశాల మేరకు హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు రేబీస్ వ్యాధిపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కల యజమానులు క్రమం తప్పకుండా తమ కుక్కలకు వేక్సీన్ వేయించాలని, వీధికుక్కల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పిచ్చికుక్క, వీధి కుక్క కరచినపుడు కొద్ది రోజుల్లోనే "జలభయ రోగం" లేదా రేబీస్ అనే ప్రాణాంతక వ్యాధికి గురై నీటిని చూసినా, వెలుతురును చూసినా తీవ్రంగా భయపడుతూ కండరాలు బిగదీసుకుపోయి మరణం సంభవిస్తుంది. దీనిని ప్రజలు గుర్తించి కుక్క కరిచిన వెంటనే చికిత్స చేయించుకోవాలని సూచించారు. నాటువైద్యాలను ఆశ్రయించి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దన్నారు. కుక్క కరిచిన వెంటనే గాయంను ధారాళంగా సబ్బు నీటితో కడిగి వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంకు వెళ్లి వైద్యుల పర్యవేక్షణలో నిర్ధారించిన రోజులలో వెళ్లి వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్ జి.కమల, ఆశ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## పవన్‌కళ్యాణ్ దీక్షకు మద్దతుగా ఎమ్మెల్యే పూజలు

(సత్యంన్యూస్, రణస్థలం)

తిరుమల లడ్డూ తయారీలో అపచారం జరిగిందంటూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేపడుతున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు శనివారం మండలంలోని గిరివానిపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ విశ్వక్సేన్, జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## బాలు స్వర నీరాజనం పాటలు పోటీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గాయకుడు దివంగత ఎస్పీ బాలసుబ్రమణ్యం వర్థంతిని పురస్కరించుకొని స్థానిక బాపూజీ కళా మందిరంలో నిర్వహించిన బాలు స్వర నీరాజనం పాటల పోటీలు శనివారం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని ఎల్‌చార్మి ప్రతిభ కనబరిచి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకోవడం పట్ల స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వాడాడ శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ కేవలం చదువుమాత్రమే కాకుండా సహ పాఠ్య కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దువ్వాడ హరనాధం, చాడ శ్రీనివాస్, మురళీకృష్ణ, సీతారాం, పురుషోత్తం, సుజాత, చంద్రకళ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## యువతకు స్ఫూర్తిప్రదాత భగత్ సింగ్



(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

నిస్వార్థ దేశభక్తికి ధైర్యానికి ప్రతీకగా నాటికి నేటికీ, ఏనాటికైనా యువతకు స్ఫూర్తిప్రదాత షహీద్ భగత్‌సింగ్ అని జనవిజ్ఞాన వేదిక యువత జిల్లా కన్వీనర్ బాడాన రాజు అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం తాడేల లోకేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాడాన రాజు మాట్లాడుతూ బ్రిటిష్ వారి నిరంకుశ పాలన నుండి దేశాన్ని విముక్తి చేయడానికి అతి చిన్న వయసులోనే ఉరికంబం ఎక్కిన అసలుసిసలైన దేశభక్తుడు భగత్‌సింగ్ అని అన్నారు. సాంఘిక శాస్త్రంలో యూరోపియన్ చరిత్రను తొలగించి నేటితరానికి స్ఫూర్తినిచ్చే విధంగా భగతసింగ్ లాంటి భారతీయ స్వాతంత్ర్యోధ్యమ నాయకుల జీవిత చరిత్రలు పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.ఉమాశంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాధరావు, డి.ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయలక్ష్మి, బి.నాగమణి, కె.తవిటిరెడ్డి, బి.రజని, జి.జగదాంబ, బి.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, శంకరరావు, గోపాలరెడ్డి, కమల కుమారి, సుశీల దేవి, సాయి శివాని, కృష్ణ, త్రివేణి, రవి పాల్గొన్నారు.

## 'ఆదిత్య'లో భగత్ సింగ్ జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ఎల్‌ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని శనివారం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. వీరిరువురు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించాడన్నారు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదం ద్వారా ప్రజలోకి వెళ్లి వారిని చైతన్యపరిచి దేశ స్వాతంత్ర్య కోసం పాటు పడ్డాడన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని జయంతి సందర్భంగా స్మరించుకోవడం మనందరి అదృష్టం అన్నారు. అదేవిధంగా నేటి యువత ఇలాంటి గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను చదవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్‌ఎస్‌ఎస్ పిఓ ఎం.శ్రీనివాసరావు, లైబ్రేరియన్ కమల్‌కుమార్‌లు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.